తీరనున్న వంతెన ఇక్కట్లు

- పేరూరు వద్ద వక్కిలేరు వాగుపై రూ.9కోట్లతో వంతెన నిర్మాణం ప్రారంభం
- నీటిలో రాకపోకలు సాగించలేక వాగు అవతల ఉన్న పొలాలను అమ్మేసిన రైతులు
- వంతెన ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు


వంతెన నిర్మాణానికి తవ్విన పునాదులు

రుద్రవరం: మండలంలోని పేరూరు వద్ద వక్కిలేరు వాగుపై దాదాపు రూ.9 కోట్లతో చేపట్టిన వంతెన నిర్మాణ పనులు మొదలయ్యాయి. ఇటీవల పనులకు ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి భూమి పూజ చేశారు.ఇందుకు సంబంధించి వాగులో ముళ్లచెట్లను తొలగించారు. అలాగే ప్రజల రాకపోకల కోసం సైడ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. ఇక కాంక్రీట్ పనులు చేసేందుకు పునాదులను తవ్వడంతో పాటు అందుకు కావాల్సిన సామగ్రిని సిద్ధం చేశారు.



తీరనున్న వంతెన సమస్య..

పేరూరు గ్రామానికి రెండు వైపులా వక్కిలేరు వాగు ఉంది. వర్షాకాలంలో గ్రామం నుంచి బయటకు రావాలంటే వాగు దాటాల్సిందే. ప్రాణాలను ఫణంగా పెట్టి వాగులు దాటలేక, అవస్థలు పడేవారు. అత్యవసర సేవలు, పనులు సైతం నిలిచిపోయేవి. పేరూరు–ఎర్రగుంట్ల,పేరూరు–శిరివెళ్ల రెండు వైపులకు వెళ్లాలంటే ఆ వాగు దాటాల్సి ఉంది. అయితే వంతెనలు లేక పోవడంతో ప్రజల రాకపోకలు నిలిచిపోయేవి. వాగు వతలి వైపు ఉన్న పొలాలున్న రైతులు వెళ్లడానికి వీలు లేకపోవడంతో పొలాలను బీడుగా వదిలేదశారు. గతంలో గంగుల ప్రతాపరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఎర్రగుంట్ల వైపు వక్కిలేరుపై వంతెన నిర్మించారు. ఆ వంతెన గ్రామ ప్రజల రాక పోకలకు కాస్త ఊపిరి పోసింది. దాదాపు 20 ఏళ్ల అనంతరం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గంగుల ప్రభాకర్‌రెడ్డి, గంగుల బిజేంద్రారెడ్డి చొరవ చూపి పేరూరు నుంచి శిరివెళ్ల వరకు తారు రోడ్డు వేయించారు. ఇప్పుడు వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడంతో పనులు మొదలయ్యాయి.


కాంక్రీట్ పనులకు సిద్ధం చేసిన కంకర,సిమెంటు బస్తాలు

ప్రభుత్వం మంచి పనులు చేస్తుంది



మా గ్రామాల వైపు ఏదైన అభివృద్ధి జరిగింది అంటే అది ఇప్పటి ప్రభుత్వంలోనే. గంగుల కుటుంబం చొరవతో నాడు ఎర్రగుంట్ల వైపు వంతెన నిర్మించారు. నేడు శిరివెళ్ల నుంచి పేరూరు, ఎర్రగుడిదిన్నె, చిలకలూరు మీదుగా చందలూరు వరకు తారు రోడ్డు వేయించారు. ఇప్పుడు పేరూరు గ్రామం పక్కనే శిరివెళ్ల దారిలో ఉన్న వక్కిలేరు వాగుపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి పనులను చేపట్టారు. ఇంతకంటే మాకు ఏం కావలి.

– గోపాల్‌రెడ్డి,పేరూరు

వంతెన కల నెరవేరబోతుంది



గ్రామం నుంచి శిరివెళ్ల వైపు రాకపోకలు సాగించేందుకు వక్కిలేరు వాగు బాగా ఆటంకం కలిగించేది. వంతెన లేక పోవడంతో ఎన్నో అవస్థలు పడేవాళ్లం.మా జీవితంలో వంతెన చూడలేమనుకున్నాం. ఆ వంతెన మాకు కలగానే నిలిచి పోతుందని భావించాం.అలాంటిది తమ కళ్ల ముందే వంతెన పనులు మొదలవడం ఎంతో ఆనందంగా ఉంది.వంతెన నిర్మాణానికి చొరవ చూపిన గంగుల కుటుంబానికి, వైఎస్సార్ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– తిరుపతిరెడ్డి,పేరూరు

రైతులకెంతో ఉపయోగం



వంతెన నిర్మాణం పూర్తయితే రైతులకు ఎంతగానో ఉపయోగ పడుతుంది. గ్రామంలోని అధిక శాతం రైతులకు శిరివెళ్ల వైపు పొలాలు ఉన్నాయి. ఇన్నేళ్లు అటు వైపు వెళ్లలేక కొందరు రైతులు శిరివెళ్ల వారికి పొలాలు అమ్మేసుకున్నారు. ఇంకొందరు వర్షాధార పంటలు వేసుకునేవారు. వాగులో నీటి ప్రవాహం తగ్గినప్పుడు అటు వైపు వెళ్లి పంటలను చూసుకొచ్చేవారు. ఇప్పుడు వంతెన పూర్తయితే వ్యవసాయ పనులు చేసుకునేందుకు సులభతరమవుతుంది. రోడ్డు,వంతెన సమస్య పరిష్కరించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– వెంకటేష్,పేరూరు

క్లుప్తంగా

ఎస్పీని కలిసిన దొర్నిపాడు ఎస్‌ఐ



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్‌ఐ సురేష్

బొమ్మలసత్రం: దొర్నిపాడు ఎస్‌ఐగా సురేష్ పదవీ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో శుక్రవారం జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదోని వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న సురేష్‌ను ఉన్నతాధికారులు దొర్నిపాడుకు బదిలీ చేశారు.

వేడుకగా కల్యాణం


కల్యాణం అనంతరం శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

నంద్యాల(వ్యవసాయం): స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీలో స్పటిక లింగేశ్వర ఆలయంలో శుక్రవారం మాఘమాస బహుళ షష్టి సందర్భంగా శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణాన్ని శుక్రవారం వేడుకగా నిర్వహించారు. యోగానంద స్వామి ఆధ్వర్యంలో లక్ష్మీదేవి సహకారంతో అర్చకులు చంద్రశేఖర్ శర్మ శాస్త్రోక్తంగా కల్యాణ తంతు జరిపించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేపట్టారు. శంకర్ రెడ్డి, పత్తి సుబ్బయ్య, వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి ,అనిల్, యోగా సభ్యులు ఉన్నారు.

లక్ష్మీనరసింహ స్వామికి స్వాతి పూజలు


విశేష అలంకరణలో లక్ష్మీనరసింహ స్వామి

నంద్యాల(వ్యవసాయం): శ్రీ నృసింహ స్వామి వారి జన్మ నక్షత్రం స్వాతిని పురస్కరించుకుని పట్టణంలోని తెలుగుపేటలో వెలసిన శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి పంచామృత అభిషేకం, స్నపన తిరుమంజనం కార్యక్రమం చేపట్టి పట్టు వస్త్రాలు, పూలమాలలతో అలంకరించారు. నైవేద్యం నివేదన, మహా మంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఫారెస్ట్ అధికారి వేధిస్తున్నారు


ఉన్నతాధికారులకు నివేదించిన పత్రాన్ని చూపుతున్న ఎఫ్ఎస్‌ఓ రష్మిమణి

నంద్యాల(సిటీ): నంద్యాల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ దినేష్‌కుమార్ రెడ్డి తనను మానసికంగా వేధిస్తున్నారని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్, ఏపీ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రష్మిమణి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 2023 జులైలో ఆయన ప్రవర్తన మార్చుకోవాలని అప్పటి డీఎఫ్‌ఓకు 12 మంది సిబ్బందితో కలిసి మాస్ లీవ్ లెటర్‌ను అందించడాన్ని సహించలేక ఇలా వ్యవహరిస్తున్నారన్నారు. జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ అనురాగ్ మీనా వివరణ కోరగా.. కమిటీ వేశామని, నివేదిక మేరకు చర్యలు ఉంటాయని చెప్పారు.

చవకబారు రాజకీయాలు మానుకోవాలి


చాగలమర్రిలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చాగలమర్రి: టీడీపీ నాయకులు చవకబారు రాజకీయాలు మానుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు ముల్లా ఖాదర్‌బాషా, వైస్ ఎంపీపీ ముల్లా రఫీ, ఉప సర్పంచ్ షేక్ మహమ్మద్ సోహెల్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆళ్లగడ్డ టీడీపీ నాయకుడు భూమా జగత్‌విఖ్యాత్ రెడ్డి గురువారం చాగలమర్రిలోని ముత్యాలపాడు బస్టాండులో మెకానిక్ షెడ్ ప్రారంభోత్సవానికి విచ్చేసి పూర్తి సమాచారం తెలుసుకోకుండా ఇంటి యజమానిపై అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. ముల్లా ఖాదర్‌బాషా మాట్లాడుతూ నా ఇంటిని నాలుగు సంవత్సరాల క్రితం స్పేర్‌పార్ట్ దుకాణానికి జీఎం బాషాకు అద్దెకు ఇచ్చానన్నారు. ఇంటి నిర్మాణం చేపట్టాలనుకుంటున్నాని,ఫిబ్రవరి నెలాఖరుకు ఇల్లు ఖాళీ చేయాలని నాలుగు నెలల క్రితం షెడ్డు నిర్వహిస్తున్న లాలూకు తెలియజేశాడు. లాలు వేరే పార్టీలో చేరడంతోనే ఖాళీ చేయించారని ఆరోపించడం తగదన్నారు. ఎంపీటీసీ ఫయాజ్, షరీఫ్, ప్రచార కార్యదర్శి రఫీ, డైరెక్టర్ జుబేర్, వార్డు మెంబర్లు ముల్లా బురాందీన్, మాబున్నీసా, ముల్లా జైలాబ్దిన్, బబ్లూ షోయబ్ ఉన్నారు.

కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖర స్వామి దేవస్థానంలో శుక్రవారం మాఘమాసం పురస్కరించుకొని కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం అనంతరం వివిధ రకాల పూజలు చేపట్టి ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమం జరిపించి పుష్పాభిషేకం, మహామంగళ హారతులు ఇచ్చారు. అనంతరం రాహు: కాల పూజలు చేపట్టారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేయించారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అసిస్టెంట్ కమిషనర్‌గా సీతామోహన్



నంద్యాల(వ్యవసాయం): నంద్యాల జిల్లా దేవదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా సీత మోహన్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న సుధాకర్‌రెడ్డి ప్రమోషన్‌పై కర్నూలుకు బదిలీ అయ్యారు. శుక్రవారం సుధాకర్‌రెడ్డి నుంచి సీతామోహన్ బాధ్యతలు స్వీకరించారు. కృష్ణ, సరస్వతి, సురేఖ, బిందు, వంశీ కృష్ణ శశికుమార్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ నాగప్రసాద్, చంద్రుడు, జనార్దన్, గోపీ, ఏడీ వెంకటరమణ ఉన్నారు.


బాచ్చాపురంలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎంపీ పోచా, గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల

వైఎస్సార్‌సీపీతోనే పల్లెల్లో ప్రగతి

- మండలంలో రూ.6.52 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం

ఆళ్లగడ్డ: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాతే పల్లెలు ప్రగతి పథంలో పయనిస్తున్నాయని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలో రూ.6.52 కోట్లతో నిర్మించిన అభివృద్ధి పనులను ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి అధ్యక్షతన ప్రారంభించారు. వారు మాట్లాడుతూ బాచ్చాపురంలో కల్వర్టు రూ.13లక్షలు, పైపు లైన్ రూ.12లక్షలు, నాడు–నేడు రూ.12లక్షలు, సీసీరోడ్లు రూ.15లక్షలు, జి.జంబులదిన్నెలో కల్వర్టు 24.20లక్షలు, పైప్‌లైన్ రూ. 25.66 లక్షలు, సీసీరోడ్లు రూ.10లక్షలు, నాడు–నేడు 23.44లక్షలు, పేరాయిపల్లె హెల్త్ సెంటర్ రూ.20.80 లక్షలు, సీసీ రోడ్లు రూ. 20లక్షలు, గోపాలపురం ఓహెచ్ఎస్ఆర్ రూ.25.66, నల్లగట్లలో రూ.సీసీ డ్రైనేజీ రూ.20లక్షలు, జీఎస్‌బీ రూ. 43.60, బత్తలూరులో సీసీరోడ్లు 26లక్షలు, శాంతినగరం సీసీ రోడ్లు రూ.9లక్షలు, ఎస్.లింగందిన్నెలో జీఎస్‌బీ రూ.43.60, ఆర్‌బీకే రూ.23.94, వైఎస్సార్ హెల్త్ సెంటర్ రూ.20.80లక్షలు, కోటకందుకూరు సీసీరోడ్లు రూ.25లక్షలు, ఆర్ .కృష్ణాపురంలో సీసీరోడ్లు రూ.11లక్షలు, బాచేపల్లిలో జీఎస్‌బీ రూ.43.60, ఆర్‌బీకే రూ.23.94, సీసీరోడ్లు (తండాలో) రూ.35లక్షలు, దొరకొట్టాలలో సీసీరోడ్లు రూ.10లక్షలు, అహోబిలంలో జీఎస్‌బీ రూ.43.60, సీసీరోడ్లు రూ.9లక్షలు, మిట్టపల్లిలో సీసీరోడ్లు రూ.18లక్షలు, యాదవాడలో సీసీరోడ్లు రూ.13లక్షలతో నిర్మించారు. కొన్ని గ్రామాల్లో దశాబ్దాలుగా లేని రోడ్లను వేశామన్నారు. మరోసారి జగన్‌ను ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధిని తెచ్చుకోవచ్చన్నారు. ఎంఈఓ శోభావివేకవతి, పీఆర్ డీఈ లక్ష్మినరసింహులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామకృష్ణనాయక్, ఎంపీడీఓ రమణారెడ్డి పాల్గొన్నారు.

ఊరూరా పింఛన్ల పండుగ


దేవనగర్‌లో కిడ్నీ బాధితుడికి రూ.10వేలు అందజేస్తున్న కౌన్సిలర్ చంద్రశేఖర్, వలంటీర్ సురేష్


సుద్దమల్లలో శ్రీనివాసరెడ్డికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ లక్ష్మీకాంతగౌడ్

ఉయ్యాలవాడ: మండలంలోని వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం శుక్రవారం పండుగలా సాగింది. తెల్లవారుజామున వలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది, గృహసారథులు అవ్వా,తాతలకు తలుపుతట్టి రూ. 3 చొప్పున పింఛన్ అందజేశారు. సుద్దమల్లలో గ్రామ సచివాలయ కన్వీనర్ పల్లె శ్రీనివాసరెడ్డి, గృహసారథి లక్ష్మీశ్వేత, వలంటీర్ లక్ష్మీకాంతగౌడ్ పింఛన్లు పంపిణీ చేశారు. గ్రామాల పరిధిలో 3,983 ఫింఛన్లు ఉండగా మొదటిరోజు 72 శాతం పంపిణీ పూర్తయినట్లు ఎంపీడీఓ రఘురాం తెలిపారు. ఈ నెల 5వ తేదీ వరకు పంపిణీ కొనసాగుతుందని పేర్కొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను వినియోగించుకోండి


ఆర్.నాగులవరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం


చింతలచెరువులో రక్త పరీక్షలు నిర్వహిస్తున్న టెక్నీషియన్ నాయక్, సిబ్బంది

రుద్రవరం: మండలంలోని ఆర్.నాగులవరంలో శుక్రవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్లు జయలక్ష్మి, ప్రశాంత్, శివాని 482 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందజేశారు. ఎంపీటీసీ రామచంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఓబులేసు ఉన్నారు.

చాగలమర్రి : మండలంలోని ముత్యాలపాడు పీహెచ్‌సీ పరిధిలోని చింతలచెరువు గ్రామ ఉన్నత పాఠశాలలో శుక్రవారం డాక్టర్ శివమోహన్ ఆధ్వర్యంలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మండలపరిషత్ ఏఓ భరణికుమారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శిబిరంలో సుమారు 324 మంది వైద్య సేవలు పొందినట్లు డాక్టర్ శివమోహన్ తెలిపారు. కీళ్ళు ఎముకల వ్యాధి నిపుణులు నరేష్ , చిన్న పిల్లల వైద్య నిపుణులు సురేష్, కంటి వైద్య నిపుణులు రమేష్ వైద్య సేవలు అందించారు. పంచాయతీ కార్యదర్శి దస్తగిరి, ఎంపీహెచ్ఈఓలు వెంకటేశ్వర్లు, ఫార్మాసిస్ట్ రాజేష్ పాల్గొన్నారు.

శిరివెళ్ల: జీనేపల్లె గ్రామ సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్ 2 వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. యర్రగుంట్ల ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ శ్రీ భవ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నంద్యాల స్పెషలిస్ట్ డాక్టర్లు కంటి వైద్య నిపుణుడు కృష్ణమోహన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సచివాలయ పరిధిలోని వనికినిదిన్నె, పార్వతీపురం, బీపీఎస్ నగర్ గ్రామాలకు చెందిన 150 మందికి కంటి, బీపీ, షుగర్, తదితర వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచు రఘునాథరెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు చీమల అనూష ఉన్నారు.


జీనేపల్లెలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

అక్రమ మద్యం ధ్వంసం


పట్టుబడిన మద్యం, నాటుసారాను ధ్వంసం చేస్తున్న సెబ్ పోలీసులు

బొమ్మలసత్రం: అక్రమంగా విక్రయిస్తూ పట్టుబడిన 166 లీటర్ల నాటుసారా, 28 లీటర్ల ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం సీసాలను ధ్వంసం చేసినట్లు సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక సెబ్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో అక్రమంగా పట్టుబడిన మద్యాన్ని సిబ్బందితో ధ్వంసం చేయించినట్లు చెప్పారు. జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు విస్తృతం చేశామన్నారు. సీఐ విశ్వనాథ్‌రెడ్డి మాట్లాడుతూ గడివేముల మండలం తిరుపాడు గ్రామ శివారులో అక్రమంగా తరలిస్తున్న 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని నిందితుడు సుబ్బయ్యను రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

‘ఉపాధి’ సమస్యల పరిష్కారానికి కృషి


కూలీలతో మాట్లాడుతున్న అంబుడ్స్ పర్సన్ సురేంద్ర

నంద్యాల(అర్బన్): ఉపాధి పనుల్లో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎన్ఆర్‌ఈజీఎస్ జిల్లా అంబుడ్స్ పర్సన్ సురేంద్ర తెలిపారు. మండలంలోని చాబోలు గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సౌకర్యాలు, వేతనాలు, పనులపై కూలీలను అడిగి తెలుసుకున్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

రుద్రవరం: ఎరువులు,పురుగు మందులను ఎమ్మార్పీకే విక్రయించాలని అతిక్రమించి అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి కృష్ణ తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం ఆయన మండలంలోని ఎరువులు, పురుగు మందు దుకాణాదారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డీలర్లు తప్పనిసరిగా స్టాక్ రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలు సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. ఏఈఓ రాజు ఉన్నారు.

ఖాళీ పోస్టుల భర్తీకి నేడు పరీక్షలు

నంద్యాల(అర్బన్): మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పర్యవేక్షణలో కొనసాగుతున్న సఖి వన్‌స్టాప్ సెంటర్‌లో పోస్టుల భర్తీకి శనివారం స్థానిక నేషనల్ డిగ్రీ కళాశాలలో మధ్యాహ్నం 2 గంటలకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి సాధికారత అధికారిణి నిర్మల శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సెంటర్ అడ్మినిస్ట్రేటర్, కేసు వర్కర్, పారా లీగల్ పర్సనల్ సైకో సోషల్ కౌన్సిలర్, ఆఫీసు అసిస్టెంట్, జిల్లా ప్రాజెక్టు అసిస్టెంట్ పోస్టులకు పరీక్షలు నిర్వహిస్తున్నామని, అభ్యర్థులందరూ మధ్యాహ్నం 1 గంటలోపు నివేదికలు అందజేయాలని సూచించారు. అభ్యర్థులు తమ వెంట ఫొటోతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను తీసుకురావాలని కోరారు.

సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి

గోస్పాడు: సేవా దక్పథాన్ని అలవర్చుకోవాలని మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కేఎస్ఎస్ నాయక్ పేర్కొన్నారు. మండలంలోని కానాలపల్లె గ్రామంలో శుక్రవారం జాతీయ సేవ పథకం ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి డాక్టర్ సరోజినీదేవి , ఏఓ స్వప్నికారెడ్డి, హెచ్ఎం శార్దక్ బాబు, డాక్టర్లు అబ్దుల్ సలాం , విజయ భాస్కర్, మెడిటేషన్ ట్రెయినర్ శ్రీ లక్ష్మి నారాయణరెడ్డి, ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి డాక్టర్ సంతోష్ నాయక్ పాల్గొన్నారు.

300 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక


ఎమ్మెల్యే శిల్పారవి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, జనసేన నాయకులు

నంద్యాల: పట్టణంలోని దేవనగర్, మూల్లాన్ పేట, నూనెపల్లె, ఉప్పరిపేట, ఫారుక్ నగర్ ప్రాంతాలకు చెందిన నాయకులు టీడీపీ, జనసేన పార్టీలను వీడి 300 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం చేరారు. ఆయా పార్టీల నాయకులు అఖిల్, ఉదయ్, వరుణ్, చరణ్, సూరి, మద్దిలేటి, మోహిత్, అరుణ్‌బాషా, సైపుద్దీన్, పూరి, హుసేన్, ప్రతాప్, సాయి, రవి, జబిఉల్లా, అబ్దుల్లా, రవి, షబ్బీర్, హర్ష, వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలన, పథకాలు, అభివృద్ధిని చూసి ఆకర్షితులై పార్టీలో చేరారన్నారు. నాయకులు ప్రదీప్‌రెడ్డి, దేవనగర్ బాషా, సుధీర్, అడ్వకేట్ ప్రతాప్‌రెడ్డి అర్జున్, కారురవికుమార్, రవికిరణ్, మణికంఠ పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక


గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ పోచా, ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ నాయకులు

ఆళ్లగడ్డ: రుద్రవరం మండలం యల్లావత్తుల గ్రామానికి చెందిన 30 కుటుంబాలు టీడీపీని వీడి విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. మైకు పుల్లయ్య, చిన్నపాములేటి, చిన్న లక్ష్మన్న, బాల నరసింహుడు, కుమార్ రాజా, విజయుడు తో పాటు పలువురు స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. లక్ష్మిరెడ్డి, సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌ల అందజేత

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని 2023–24 ఆర్థిక సంవత్సరానికి 6 నుంచి 9వ తరగతుల వరకు గత ఏడాది అక్టోబర్ 8న తపాలా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫిలాటిలి స్కాలర్‌షిప్ స్కీమ్ దీన్‌దయాళ్ స్పర్ష్ యోగన నిర్వహించిన పరీక్షల్లో నంద్యాలకు చెందిన విద్యార్థులు విజేతలుగా నిలిచినట్లు పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ విజేతలైన విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఒక్కొక్కరికి రూ.6వేలు వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు విజేతలుగా నిలిచినట్లు తెలిపారు. గుడ్‌షెప్పర్డ్ స్కూల్ విద్యార్థిని తహనాజ్ పది క్లాస్ డాయి ఆఖర్ లెటర్ రైటింగ్ కాంపిటీషన్‌లో 18సంవత్సరాల వరకు ఎన్వలాఫ్ కేటగిరి కింద 2023–24 ఏడాదికి ఆంధ్రప్రదేశ్ సర్కిల్ స్థాయిలో టాప్–1 విజేతగా నిలిచి రూ.25వేలు నగదు బహుమతి పొందిందన్నారు.

హామీలు నెరవేర్చాలి

నంద్యాల(న్యూటౌన్): ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని పీఆర్‌టీయూ నంద్యాల జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రామపక్కీర్‌రెడ్డి, భాస్కరరెడ్డి శుక్రవారం కోరారు.

చిన్నారుల రక్షణకు పోలియో చుక్కలు

నంద్యాల(సిటీ): చిన్నారుల రక్షణకు రెండు పోలియో చుక్కలు వేయించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నంద్యాల అర్బన్ పరిధిలో ఆదివారం 121 పోలియో కేంద్రాల్లో 31,352 మంది చిన్నారులకు చుక్కలు వేయనున్నామన్నారు.

సీఎం ఆర్ఎఫ్ పేదలకు వరం


పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(సిటీ): ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరంగా మారిందని ఎమ్మెల్యే శిల్పారవిచంద్ర కిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో ఆరోగ్య శ్రీ పరిధిలోకి రాని పలు వ్యాధులకు చికిత్స పొందడానికి ఈ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఏడుగురికి రూ.7.25లక్షల విలువ చేసే చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. పట్టణ లీగల్ సెల్ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, నాయకులు లక్ష్మీనారాయణ, కిరణ్ కుమార్, తిమోతి పాల్గొన్నారు.

నంద్యాల(అర్బన్): హౌసింగ్ లోన్‌లో ఉన్న రుణాలను వన్‌టైం సెటిల్‌మెంట్ చేసి ఇళ్ల పట్టాలను అందజేసిన నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డికి ముల్లాన్‌పేట, శిల్పానగర్ గృహ లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. 2004లో మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి పట్టణంలోని ముల్లాన్‌పేట, శిల్పా నగర్‌కు చెందిన 52 మంది పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి హౌసింగ్ లోన్ తీసుకొని రుణాల చెల్లింపులో జాప్యం జరిగింది. ఎమ్మెల్యే చొరవతో హౌసింగ్ రుణాలపై సంబంధిత అధికారులతో చర్చించి వన్‌టైం సెటిల్‌మెంట్ చేసి లబ్ధిదారులకు శుక్రవారం ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేయగా, లోన్లతో లబ్ధిదారులు గృహాలను పూర్తి చేశారన్నారు. అయితే వారు తీసుకున్న రుణాలను చెల్లించడంలో జాప్యం జరిగిందని చెప్పారు. మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ సలాముల్లా, దండె సుధాకర్, దండె శీను, ఫారూక్, అన్వర్, కరీముల్లా పాల్గొన్నారు.